క్లుప్తంగా

హ్యూమన్ రైట్స్ మండల అధ్యక్షుడిగా ప్రహ్లాద్


గిత్తె ప్రహ్లాద్

ఇచ్చోడ: మండల కేంద్రానికి చెందిన గిత్తే ప్రహ్లాద్ నేషనల్ హ్యూమన్ రైట్స్ మండల అధ్యక్షుడిగా ఎంపికయ్యారు. ఈ మేరకు జిల్లా అధ్యక్షుడు పురుషోత్తం రెడ్డి శుక్రవారం నియమక పత్రం అందజేశారు. ప్రహ్లాద్ మాట్లాడుతూ.. మానవ హక్కుల కోసం తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

వీధి వ్యాపారులకు పీఎం స్వనిధి రుణాలు


స్ట్రీట్ ఫుడ్ వెండర్స్‌కు శిక్షణ ఇస్తున్న అధికారి

కైలాస్‌నగర్: వీధి వ్యాపారులకు పీఎం స్వనిధి పథకం కింద అందించే రుణాలను కేంద్ర ప్రభుత్వం పునరుద్ధరించిందని, ఈ అవకాశాన్ని సద్వి నియోగం చేసుకుని రుణాలను పొందాలని మెప్మా డీఎంసీ కె.శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మున్సి పల్ కార్యాలయ సమావేశ మందిరంలో పట్టణంలోని స్ట్రీట్ ఫుడ్ వెండర్స్‌కు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. ఆహార పదార్థాలను విక్రయించే సమయంలో పాటించాల్సిన జాగ్రత్తలు, పారిశుద్ధ్యంపరంగా తీసుకోవాలిన్సన చర్యలపై అవగాహన కల్పించారు. రూ.10వేల నుంచి రూ.15వేలకు, రూ.20 వేల నుంచి రూ.25వేలకు, రూ.50వేల వరకు రుణాలను అందించడం జరుగుతుందన్నారు. పట్టణంలోని వీధి వ్యాపారులు మున్సిపల్ కార్యాలయంలోని మెప్మా విభాగాన్ని సందర్శించి రుణాల కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సమావేశంలో మెప్మా టీఎంసీ భాగ్యలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

స్కావెంజర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

ఆదిలాబాద్‌రూరల్: మావలలోని కేజీబీవీలో స్వీపర్ కామ్ స్కావెంజర్ పోస్టుకు మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మండల విద్యాధికారి ఆడే సరోజ ఒక ప్రకటనలో తెలిపారు. పోస్టుకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థి వయస్సు 18 సంవత్సరాల నుంచి 45 సంవత్సరాలలోపు, 7వ తరగతి పాసై ఉండాలన్నారు. ఆసక్తి, అర్హత గల వారు దరఖాస్తును ఈనెల 29లోగా మండల విద్యాశాఖ అధికారి కార్యాలయంలో సమర్పించాలన్నారు.

పాన్‌షాపుల్లో పోలీసుల తనిఖీలు

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని రిమ్స్ ఎదుట ఉన్న పాన్‌షాపు, ఇతర షాపుల్లో పోలీసులు శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. నిషేధిత గుట్కా, తంబాకు ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. నిబంధనలకు విరుద్ధంగా విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామని టు టౌన్ సీఐ నాగరాజు హెచ్చరించారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీస్‌స్టేషన్ పరిధిలోని దుర్గనగర్ వంతెన సమీపంలో శుక్రవారం గుర్తు తెలియని మృతదేహం లభ్యమైనట్లు సీఐ కర్రె స్వామి తెలిపారు. మృతుని వయస్సు సుమారు 30 ఏళ్ల నుంచి 35 ఏళ్లలోపు ఉంటుందన్నారు. బీహార్ రాష్ట్రానికి చెందిన వ్యక్తి ఉన్నట్లు తెలుస్తుందన్నారు. గతకొన్ని రోజులగా మద్యం సేవిస్తూ.. తిరుగుతూ.. కనిపించాడని స్థానికులు తెలిపారన్నారు. సంబంధీకులు ఎవరైనా ఉంటే మావల పోలీసులను సంప్రదించాలన్నారు.

ఆటో బస్సు ఢీ.. ఒకరికి తీవ్ర గాయాలు

ఉట్నూర్‌రూరల్: మండలంలోని శ్యాంపూర్ గ్రామంలో శుక్రవారం ఆటో, ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో ఆటో డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్యాంపూర్ పరిధిలోని కొలాంగూడ గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ టేకం దాదేరావు ఆటో రిపేర్ కోసం శ్యాంపూర్ వెళ్లి తిరిగి వస్తుండగా.. ఆదిలాబాద్ నుంచి ఉట్నూర్ వైపు వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీ కొనడంతో ఆటో డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108 ద్వారా ఉట్నూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం అక్కడి వైద్యులు పరిస్థితి విషమంగా ఉండటంతో ఆదిలాబాద్ రిమ్స్‌కు రెఫర్ చేశారు.

దేశీదారు బాటిళ్లు స్వాధీనం

సాత్నాల: దేశీదారు అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్సై గౌతమ్ పవర్ హెచ్చరించారు. పక్కా సమాచారంతో శుక్రవారం పిప్పర్‌వాడ టోల్‌ప్లాజా వద్ద తనిఖీ నిర్వహించగా, మహారాష్ట్రలోని బోరి గ్రామం నుంచి ఆటోలో అక్రమంగా తరలిస్తున్న దేశీదారుని పట్టుకున్నారు. ఆదిలాబాద్ ఖానాపూర్‌కు చెందిన అంజాద్ ఖాన్ను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు. కానిస్టేబుల్ స్వామి, మోహన్ ఉన్నారు.

పెరిగిన మొక్కజొన్న సాగు

- ఆశాజనకంగా పంట
- పెట్టుబడి తక్కువ
- దిగుబడిపై రైతుల ఆశలు


సిరికొండలో సాగు చేస్తున్న మొక్కజొన్న

సిరికొండ: పత్తి సాగుకు ప్రత్యామ్నాయంగా రైతులు ఇతర పంటలు సాగు చేసేందుకు మొగ్గు చూపుతున్నారు. తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి సాధించేందుకు మండల రైతులు మొక్కజొన్న సాగు చేస్తున్నారు. ఈ ఏడాది అధిక మొత్తంలో మొక్కజొన్న పంట సాగు చేస్తున్నారు. ఎక్కడా చూసినా.. మొక్కజొన్న పంటలు కనిపిస్తున్నాయి.

తక్కువ పెట్టుబడితో..

రైతులు పత్తి, సోయా పంటలను సాగుచేస్తే ఎరువులు, రసాయనిక మందులు పిచికారీ చేయడంతో పెట్టుబడి ఖర్చులు కూడా పెరుగుతున్నాయి. వీటన్నింటిని దృష్టిలో పెట్టుకొని తక్కువ పెట్టుబడితో సాగు అయ్యే పంటలను సాగు చేసేందుకు రైతులు మొగ్గు చూపుతున్నారు. మొక్కజొన్న చేతికి వచ్చిన వెంటనే మళ్లీ రబీ పంట సాగు చేస్తారు. మండలంలో అధికంగా ఇసుక భూములు మొక్కజొన్న పంటకు అనుకూలంగా ఉండడంతో రైతులు సాగు చేస్తున్నారు. వ్యవసాయాధికారులు లెక్కల ప్రకారం ఈ ఏడాది 800 ఎకరాల్లో విస్తీర్ణంలో పంట సాగు చేస్తున్నారు.

వాతావరణం అనుకూలం..

మండలంలోని వాతావరణం మొక్కజొన్న పంటకు అనుకూలంగా ఉంటుంది. ఇసుక భూములకు తోడుగా ఈ ఏడాది వర్షాలు కూడా విస్తరంగా కురిశాయి. ఎంతటి వాతావరణాన్ని కూడా తట్టుకుంటుందని రైతులు మొక్కజొన్న పంట సాగు చేస్తున్నారు. భారీ వర్షాలు కురుస్తున్నా.. పంటకు ఎలాంటి నష్టం ఉండదు. దీంతో రైతులు పంట దిగుబడిపై ఆశతో ఉన్నారు.

8 ఎకరాల్లో సాగు..



నేను గత కొన్ని సంవత్సరాలుగా మొక్కజొన్న పంట సాగు చేస్తున్నాను. ఈఏడాది 8 ఎకరాల్లో పంట సాగు చేస్తున్నా. ఇసుక భూముల్లో మొక్కజొన్న అధిక దిగుబడి వస్తుంది. ప్రస్తుతం పంట ఆశాజనకంగా ఉంది. అలాగే పెట్టుబడి ఖర్చులు కూడా తక్కువగా ఉంటాయి.

– జిల్లా భూమన్న, రైతు, సిరికొండ

కౌలుకు తీసుకొని..



నేను నాలుగు ఎకరాల వ్యవసాయ భూమిని కౌలుకు తీసుకుని మొక్కజొన్న సాగు చేస్తున్నా. పత్తి, సోయా అధిక ఖర్చుతో కూడుకున్నది. కలుపు మొక్కల నివారణ కూడా కష్టం. మొక్కజొన్న పంట సాగు చేస్తే తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి సాధించవచ్చు. రైతులకు ఎలాంటి నష్టం ఉండదు.

– మంగరపు భీమన్న, రైతు, కొండాపూర్

గ్రామాల అభివృద్ధికి పెద్దపీట

- ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్


భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు

ఇంద్రవెల్లి: గ్రామాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. శుక్రవారం మండలంలోని హర్కపూర్ ఆంధ్‌గూడ గ్రామంలో రూ. 12 లక్షల నిధులతో మంజూరైన అంగన్‌వాడీ భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల పాటు గ్రామాల్లో చేసిన అభివృద్ధి శూన్యమన్నారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన రెండేళ్లలో డ్రెయినేజీలు, సీసీరోడ్లు, నూతన భవనాలను నిర్మించామన్నారు. పేదల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఒక్క రేషన్‌కార్డు కూడా మంజూరు చేయలేదన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ముఖడే ఉత్తం, తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, ఎంపీడీవో జీవన్‌రెడ్డి, కుడే కైలాస్, జితేందర్, యాకుబ్‌బేగ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

కుంకుమ పూజలు.. బోనాలు


పూజలు చేస్తున్న మహిళలు


కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

ఇంద్రవెల్లి: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలను భక్తులు ఘనంగా నిర్వహించారు. ప్రతీ రోజు ఉదయం, సాయంత్రం ప్రత్యేక పూజలు చేస్తున్నారు. ఆయా మండలపాల వద్ద దాండియ నృత్యం ఆకట్టుకుంది. శుక్రవారం మండల కేంద్రంలోని నవయువ దుర్గామాత మండపం వద్ద కుంకుమార్చన నిర్వహించారు. ఆవినాష్ మహరాజ్ ఆధ్వర్యంలో పూజలు చేశారు.

బోథ్: దేవి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా కౌఠ(బి) గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. గ్రామంలోని భవాని యూత్ మండపం వద్ద మహిళలు కుంకుమార్చన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. అనంతరం దుర్గాదేవికి ప్రత్యేక పూజలు చేశారు.

మహాలక్ష్మి రూపంలో అమ్మవారు దర్శనం

బోథ్ మండల కేంద్రంలోని దుర్గామాతకు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శుక్రవారం అమ్మవారు మహాలక్ష్మి దేవి రూపంలో దర్శనమిచ్చింది. భక్తులు మండపంలో కుంకుమ పూజలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు, నైవేద్యాలు సమర్పించారు.

దుర్గాదేవికి..


తలమడుగు: బోనాలు ఎత్తుకున్న మహిళలు

నేరడిగొండ: దేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం మండలంలోని వడూర్ గ్రామంలో దుర్గాదేవి బోనాల జాతర కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మహిళలు బోనాలతో శోభాయాత్ర చేపట్టారు. పోతురాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి.

తలమడుగు: మండలంలోని సుంకిడి, కొత్తూరు, తలమడుగు గ్రామాల్లో దుర్గామాతకు ప్రత్యేక పూజలు నిర్వహించి, బోనాలు సమర్పించారు. అలాగే కుంకుమార్చన చేపట్టి ప్రత్యేక పూజలు చేశారు. వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య పూజ కార్యక్రమాలు నిర్వహించారు. మహిళలు డప్పు వాయిద్యాలతో బోనాలను ఎత్తుకొని ఊరేగింపుగా వెళ్లి సమర్పించారు.

విద్యార్థుల హాజరు శాతం పెంచాలి


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సునీల్


మాట్లాడుతున్న డీఐఈవో గణేశ్‌కుమార్

ఇచ్చోడ: విద్యార్థుల హాజరుశాతం పెంచాలని, ఈ మేరకు తల్లిదండ్రులు తమ పిల్లలను క్రమం తప్పకుండా కళాశాలకు పంపాలని డీఐఈవో గణేశ్‌కుమార్ అన్నారు. మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థుల తల్లిదండ్రులతో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వ కళాశాలల్లో నాణ్యమైన విద్యాబోధన అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శంకర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

నేరడిగొండ: విద్యార్థుల హాజరు శాతం పెరిగేలా తల్లిదండ్రులు కృషి చేయాలని డీఐఈవో గణేశ్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పేరెంట్–టీచర్స్ సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలు, అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రిన్సిపల్ శభాన తరన్నమ్, లెక్చరర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

బజార్‌హత్నూర్: విద్యార్థులపై తల్లిదండ్రుల పర్యవేక్షణ ఉండాలని ప్రిన్సిపాల్ సునీల్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పేరెంట్స్, టీచర్స్ మీటింగ్ నిర్వహించారు. బోర్డు పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలంటే తల్లితండ్రుల సహకారం తప్పనిసరిగా ఉండాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు జ్ఞానేశ్వర్, ప్రదీప్, అశోక్‌రెడ్డి, హైమద్, గంగాధర్, సుభాష్, వనజ, రామారావ్ పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి: తల్లిదండ్రులు పిల్లల చదువును ప్రోత్సహించాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మారుతి అన్నారు. శుక్రవారం మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తల్లిదండ్రుల, అధ్యాపక సమావేశం నిర్వహించారు. ఇంటర్మీడియట్‌లో అత్యధిక మార్కులు సాధించేందుకు అధ్యాపకులతో పాటు తల్లిదండ్రుల సహకారం ఎంతో ముఖ్యమైనదన్నారు. కార్యక్రమంలో సామాజిక కార్యకర్త రాథోడ్ అనిల్, మాజీ ఎంపీపీ కనక తుకారం, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యార్థుల చదువుపై దృష్టి సారించాలి..

తాంసి: ప్రతీ విద్యార్థి చదువుపై దృష్టి సారించే విధంగా తల్లిదండ్రులు చూడాలని తాంసి కళాశాల ప్రిన్సిపాల్ సుదర్శన్ అన్నారు. శుక్రవారం తాంసి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తల్లిదండ్రులు, అధ్యాపకుల ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. విద్యార్థులు క్రమం తప్పకుండా కళాశాలకు హాజరయ్యేలా చూడాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ సంతోశ్, అధ్యాపకులు దేవేందర్, రమణరెడ్డి, మల్లేష్, భాస్కర్, తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

బోథ్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం పేరెంట్–టీచర్ మీటింగ్ నిర్వహించారు. కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ దుర్గం నాందేవ్ మాట్లాడుతూ.. విద్యార్థుల భవిష్యత్‌లో తల్లిదండ్రుల పాత్ర కీలకమన్నారు. మంచి విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.

తలమడుగు: కళాశాలకు క్రమం తప్పకుండా విద్యార్థులను పంపించాలని కళాశాల ప్రిన్సిపాల్ సుదర్శన్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యాపకులు రమేశ్, సూర్యకాంత్, రవికాంత్, సురేశ్, పాపన్న, లింగన్న, రమాదేవి పాల్గొన్నారు.

బేల: తల్లిదండ్రులు వారి పిల్లలను సెల్‌ఫోన్‌లకు దూరంగా ఉంచాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ భగవాండ్లు పలు సూచనలు చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని కళాశాలలో పేరెంట్స్, టీచర్స్ మీటింగ్ నిర్వహించారు. విద్యార్థులు సాధించిన ప్రగతిని, కళాశాలలో జరుగుతున్న అభివృద్ధి పనులను వివరించారు. అధ్యాపకులు అమిడ్‌వార్ వినోద్, గణేష్ పాల్గొన్నారు.

పాఠశాలకు భూమి విరాళం


భూదాతలను సన్మానిస్తున్న గ్రామస్తులు

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని చించుఘాట్ గ్రామ పంచాయతీ పరిధిలోని న్యూ చించుఘాట్ గ్రామంలోని దిశ మోడల్ స్కూల్‌కు గ్రామానికి చెందిన ఉయిక మహేశ్, ఉయిక భీంరావ్ రెండెకరాల పది గుంటల భూమిని విరాళంగా అందించారు. శుక్రవారం పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో భూమిని చించుఘాట్ రాయిసెంట్ ఆధ్వర్యంలో గిరిజన ఆశ్రమ పాఠశాల కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు గోవింద్‌కు అప్పగించారు. అనంతరం వారిని పూలమాలతో సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో రాయిసెంటర్ సార్‌మేడి ఆత్రం పరుశురాం, కుమ్ర శ్యాంరావ్, గ్రామపటేల్ రాజు పటేల్, మడావి శ్యాంరావ్, మర్సుకోల కేశవ్ పాల్గొన్నారు.

చాకలి ఐలమ్మకు ఘన నివాళి


నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు


బోథ్: పాల్గొన్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

కైలాస్‌నగర్: తెలంగాణ వీరనారి చాకలి ఐలమ్మ గొప్ప పోరాట యోధురాలని కాంగ్రెస్ ఆదిలాబాద్ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాస రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జైనథ్: చాకలి ఐలమ్మ జయంతిని మండల కేంద్రంలో రజక సంఘం సభ్యులు ఘనంగా జరుపుకున్నారు. ఐలమ్మ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. రజక సంఘం మండల అధ్యక్షుడు వికాస్, రాజు, సంతోష్, అఖిల్, సోమేశ్ పాల్గొన్నారు.

తలమడుగు: మండల కేంద్రంలో శుక్రవారం చాకలి ఐలమ్మ జయంతిని ఘనంగా జరుపుకున్నారు. చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆశన్న, గంగన్న, చంటి, తదితరులు పాల్గొన్నారు.

బోథ్: భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి నుంచి విముక్తి కోసం పోరాడిన వీరనారి చాకలి ఐలమ్మ జయంతిని రజక సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం బోథ్ మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ముఖ్యఅతిథిగా హాజరై చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు నారాయణ రెడ్డి, సంధ్యారాణి, మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్, మాజీ వైస్ ఎంపీపీ స్వామి, శ్రీధర్ రెడ్డి, సురేందర్ పాల్గొన్నారు.

సాత్నాల: ఐలమ్మ సేవలు మరువలేనివని మండల అధ్యక్షుడు ముఖ్య సంతోష్ అన్నారు. భోరజ్ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాథోడ్ రాజేశ్వరి, ప్రవీణ్, రాజు, వికాస్, అరిగెల శ్రీనివాస్ పాల్గొన్నారు

ఎమ్మెల్సీ చేయూత

ఆదిలాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ గిరిజన కొలాం ఆశ్రమ పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్న విద్యార్థి ప్రవీణ్‌కు కిడ్నీలో రాళ్లు కావడంతో సర్జరీ కోసం ఎమ్మెల్సీ కొమురయ్య చేయూత అందిచినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నారాయణ తెలిపారు. సర్జరీ అనంతరం శుక్రవారం రాత్రి హైదరాబాద్‌లోని ఎమ్మెల్సీ కొమురయ్య ఇంటికి వెళ్లి పాఠశాల తరఫున, విద్యార్థి తల్లిదండ్రులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

రైతుపై అడవిపంది దాడి

బోథ్: మండలంలోని కౌఠ(బి) గ్రామానికి చెందిన రైతు పాండుపై అడవిపంది దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డాడు. శుక్రవారం మధ్యాహ్నం తన పొలంలో పనులు చేసుకుంటున్నప్పుడు అకస్మాత్తుగా అడవిపంది దాడి చేసింది. కేకలు వేయడం గమనించిన సమీప రైతులు పాండును ఆటోలో బోథ్ మండల కేంద్రంలోని సీహెచ్‌సీకి తరలించారు.

బతుకమ్మ సంబురాలు

బజార్‌హత్నూర్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థినులు శుక్రవారం బతుకమ్మ సంబురాలను జరుపుకున్నారు. విద్యార్థినులు తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి ఆడిపాడారు. ప్రిన్సిపాల్ సునీల్, అధ్యాపకులు వనజ, అనుష, జ్ఞానేశ్వర్, ప్రదీప్, అశోక్‌రెడ్డి, సుభాష్ పాల్గొన్నారు.

ఝరి పీహెచ్‌సీలో వైద్యశిబిరం


వైద్యపరీక్షలు చేస్తున్న వైద్యులు

నార్నూర్: గాదిగూడ మండలంలోని ఝరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. పలువురికి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. వైద్యాధికారి సంజీవ్ మాట్లాడుతూ.. రోగులకు మెరుగైన వైద్యం అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. వైద్యశిబిరాన్ని రోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వైద్య నిపుణులు మమత, డాక్టర్ సంజన, డాక్టర్ మహాలక్ష్మి, సంతోష్, మాజీ జెడ్పీటీసీ మెస్రం సోము పటేల్, కొడప జాకు, హెచ్ఈవో రవీందర్ రాథోడ్ పాల్గొన్నారు.

బోథ్: మండలంలోని బాబెరతండా గ్రామంలో శుక్రవారం సొనాల పీహెచ్‌సీ వైద్యులు నవీన్‌రెడ్డి ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. మాజీ సర్పంచ్ ఆడె బాబు సింగ్ వైద్య శిబిరానికి ఏర్పాట్లు చేశారు.

అలరించిన భరతనాట్యం



బోథ్ మండల కేంద్రంలోని దుర్గామాత మండపం వద్ద శుక్రవారం భరతనాట్య ప్రదర్శన నిర్వహించారు. భక్తిపాటలకు చిన్నారులు చేసిన భరతనాట్యం అలరించింది. నృత్యానికి గ్రామస్తులు మంత్రముగ్ధులయ్యారు. కార్యక్రమం ముగిసిన అనంతరం దుర్గామాత కమిటీ సభ్యులు, గ్రామస్తులు చిన్నారులను అభినందించారు. – బోథ్

సంక్షిప్త వార్తలు

నేడు జిల్లాకు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ

ఆదిలాబాద్‌టౌన్: సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ శనివారం ఆదిలాబాద్ జిల్లాకు రానున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు పూసం సచిన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో పాల్గొంటారని పేర్కొన్నారు.

సాజిద్‌ఖాన్‌కు సన్మానం

కైలాస్‌నగర్: ఇటీవల కాంగ్రెస్‌లో చేరిన డీసీసీ మాజీ అధ్యక్షుడు సాజిద్ ఖాన్‌ను జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లెపూల నర్సయ్య శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో కలిసి సత్కరించారు.

తెగిపడ్డ విద్యుత్ వైర్

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలో శుక్రవారం పెను ప్రమాదం తప్పింది. మోచిగల్లి కాలనీలో షార్ట్ సర్క్యూట్ కారణంగా విద్యుత్ వైరు తెగిపడింది. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. దీన్ని గమనించిన స్థానికులు విద్యుత్ సిబ్బందికి సమాచారం అందించారు.

నేడు విగ్రహ ప్రతిష్ఠాపన

నేరడిగొండ: మండలంలోని బొందిడి గ్రామంలో శనివారం శ్రీ రామారావు మహరాజ్ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు గ్రామస్తులు ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి కైలాష్‌టేక్డికి చెందిన లింబాజీ మహరాజ్ హాజరు కానున్నట్లు పేర్కొన్నారు.

నేడు ఉపాధిహామీ ప్రజావేదిక

నేరడిగొండ: మహాత్మా గాంధీ ఉపాధిహామీ పథకం ప్రజావేదికను శనివారం మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శేఖర్, ఈజీఎస్ ఏపీవో వసంత్‌రావులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధిహామీ కూలీలు, హాజరై ఏవైనా పొరపాట్లు జరిగితే తెలియజేయాలన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల పనులు వేగవంతం చేయాలి


ఇళ్లను పరిశీలిస్తున్న ఎంపీడీవో రమేశ్

బోథ్: మండలంలోని పట్నాపూర్, కంటేగాం, నిగిని గ్రామాల్లో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్ల పనులను వేగవంతం చేయాలని ఎంపీడీవో రమేశ్ అన్నారు. శుక్రవారం ఇందిరమ్మ ఇళ్ల పనులను పరిశీలించారు. ప్రభుత్వం దశలవారీగా నిధులు విడుదల చేస్తుందన్నారు. ఇందిరమ్మ కమిటీ సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలన్నారు. ఆయన వెంట మండల పంచాయతీ అధికారి మిథున్, రవీందర్, జితేందర్ పాల్గొన్నారు.